ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



మహబూబాబాద్
MAHABUBABAD
గురువారం 16 అక్టోబరు 2025



రూ.50కోట్లతో ప్రతిపాదనలు పంపించాం..

- గంట సంజీవరెడ్డి, కేసముద్రం మార్కెట్ చైర్మన్

కేసముద్రం మార్కెట్ అభివృద్ధితోపాటు కల్వలలో మిర్చి, పత్తి మార్కెట్ ఏర్పాటు కోసం రూ.50కోట్లతో జాతీయ గ్రామీణ మౌలిక సదుపాయాల సంస్థకు ప్రతిపాదనలు పంపించాం. ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి చొరవతో ఈ ప్రతిపాదనలు రూపొందించాం. వీటిని త్వరలో ఆమోదిస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నా. ప్రతిపాదనలు ఆమోదం పొందితే రైతులకు మిర్చి, పత్తి విక్రయించుకునేందుకు మెరుగైన సౌకర్యాలు అందుతాయి.



కల్వలలో కొత్త మార్కెట్?



కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కార్యాలయం

మిర్చి, పత్తి కొనుగోళ్లకు అవకాశం

- రూ.45 కోట్లతో 'ఎన్‌ఆర్‌ఐడీఏ'కు ప్రతిపాదనలు
- ఎనిమిది కవర్‌షెడ్లు, పూర్తి సౌకర్యాలతో అంచనాలు
- రూ.4.72 కోట్లతో కేసముద్రం మార్కెట్లో అభివృద్ధి పనులు

కేసముద్రం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకే తలమాణికంగా నిలుస్తూ.. ప్రధానమంత్రి ఎక్సలెన్సీ అవార్డుతో దేశంలోనే గుర్తింపు పొందిన కేసముద్రం వ్యవసాయ మార్కెట్ అభివృద్ధిలో కీలకమైన మలుపు చోటు చేసుకోబోతోంది. మార్కెట్ మణిహారంలో కలికి తురాయిలా కొత్త మార్కెట్ చేరబోతోంది. ఇక్కడి మార్కెట్‌ను కొనసాగిస్తూనే కొత్తగా మిర్చి, పత్తి మార్కెట్‌ను వేరుగా ఏర్పాటు చేయాలని పాలకులు నిర్ణయించారు. ఈ మేరకు కేంద్ర గ్రామీణ అభివృద్ధి మంత్రిత్వ శాఖలోని జాతీయ గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (ఎన్‌ఆర్‌ఐడీఏ)కు మిర్చి, పత్తి మార్కెట్ కోసం రూ.45 కోట్లతో మార్కెటింగ్ శాఖ ఇంజనీరింగ్ విభాగం రూపొందించి అంచనా ప్రతిపాదనలు పంపినట్లు తెలిసింది. దీంతో పాటే మరో రూ.4.72 కోట్లతో కేసముద్రం మార్కెట్లో అభివృద్ధి పనులకు కూడా అంచనాలు పంపారు. ఈ రెండు ప్రతిపాదనలకు తోడు ఇతర ఖర్చులు వెరసి రూ.50 కోట్లకు ప్రతిపాదనలు రూపొందించారు.



2024-25 ఆర్థిక సంవత్సరంలో కేసముద్రం వ్యవసాయ మార్కెట్ పరిధిలో రూ.752 కోట్ల విలువైన వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోళ్లు చేయడం విశేషం. మార్కెటింగ్ శాఖ నిర్ణయించిన లక్ష్యం కంటే అధికంగా రికార్డుస్థాయిలో 2024-2025 ఆర్థిక సంవత్సరం మార్కెట్ ఫీజు (మార్కెట్ ఆదాయం) రూ.7,52,31,198 రావడం గమనార్హం. ఈ ఏడాది మార్కెటింగ్ శాఖ నిర్ణయించిన లక్ష్యం రూ.7.19 కోట్ల మార్కెట్ ఫీజు కాగా ఈ టార్గెట్‌ను దాటి రూ.32.95 లక్షలు అధికంగానే ఆదాయం వచ్చింది. మిర్చి మార్కెట్‌తో పరిసర ప్రాంతాల ప్రజలు మిర్చి ఘాటుతో ఏటా సీజన్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో మార్కెట్‌ను దూర ప్రాంతంలో ఏర్పాటు చేయడం ఒక సౌలభ్యంగా పలువురు భావిస్తున్నారు.

కొత్త మార్కెట్ అంచనాలు ఇలా..

కేసముద్రం మండలం కల్వల రెవెన్యూ గ్రామ పరిధిలోని 610 సర్వే నెంబరులో కొత్త మిర్చి, పత్తి మార్కెట్ ఏర్పాటు కోసం అంచనాలు రూపొందించారు. ఇప్పటికే ఇదే ప్రాంతంలో జిల్లాకు విద్యుత్ సరఫరా అందించే 132/33కేవీ భారీ విద్యుత్ సబ్‌స్టేషన్, 20వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో రూ.13.76 కోట్లతో గిడ్డంగులను నిర్మించేందుకు సుమారు 15 ఎకరాల స్థలాన్ని సేకరించారు. వీటికి సమీపంలోనే కొత్త మార్కెట్ కోసం 30కి పైగా నిర్మాణ అంశాలతో రూ.45.01 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించగా ఇందులో ప్రధానంగా రూ.15.36 కోట్లతో ఎనిమిది కవర్‌షెడ్లకు, (మిగతా 10వ పేజీలో)



కాంతమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

ఎమ్మెల్యే దొంతి తల్లికి సీఎం నివాళి

- మాతృవందనం కార్యక్రమంలో పాల్గొన్న రేవంత్ రెడ్డి
- ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు పరామర్శ
- హాజరైన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు
- భారీ సంఖ్యలో పాల్గొన్న నర్సంపేట నియోజకవర్గ శ్రేణులు
- మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి భోజనం
- 27 నిమిషాల పాటు ఫంక్షన్‌హాల్‌లో గడిపిన సీఎం

హనుమకొండ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి అనుముల రేవంత్‌రెడ్డి బుధవారం నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాతృమూర్తి దొంతికాంతమ్మ దశదిన కర్మ సందర్భంగా ఏర్పాటు చేసిన మాతృవందనం కార్యక్రమంలో పాల్గొన్నారు. హనుమకొండ కేయూ 100 ఫీట్ల రోడ్డులోని పీజీఆర్ గార్డెన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సీఎం హాజరై కాంతమ్మ చిత్రపటానికి పూలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. దొంతి మాధవరెడ్డిని, ఆయన సోదరులు, కటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి తన ప్రగాఢసానుభూతిని తెలియ చేశారు. సీఎం వెంటవచ్చిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కూడా కాంతమ్మ చిత్రపటం వద్ద పూలుచల్లి అంజలి ఘటించారు. దొంతిని పరామర్శించారు. అనంతరం సీఎం వేదికపై నుంచి ప్రజలకు, కాంగ్రెస్ శ్రేణులకు చేయి ఊపుతూ అభివాదం చేశారు. ఆ తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో కలిసి భోజనం చేసి మధ్యాహ్నం 2.37 నిమిషాలకు తిరిగి వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో సీఎం 27 నిమిషాలపాటు ఉన్నారు.

గంట ఆలస్యంగా..

కార్యక్రమానికి రేవంత్‌రెడ్డి గంట ఆలస్యంగా హాజరయ్యారు. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం సీఎం మధ్యాహ్నం 1.15గంటలకు ఫంక్షన్‌హాల్‌కు చేరుకోవాల్సి ఉంది. గంట ఆలస్యంగా మధ్యాహ్నం 2.11 గంటలకు వచ్చారు. హైదరాద్‌లోని ఎంహెచ్‌ఆర్‌డీ నుంచి హెలికాప్టర్‌లో బయలు దేరి హనుమకొండ సుబేదారిలోని (మిగతా 9వ పేజీలో)



సీఎంను చూడడానికి రోడ్డుపై వేచి ఉన్న పారిశుధ్య కార్మికులు, జనం



కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న దేబాసిస్ పట్నాయక్

రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యం

- కాంగ్రెస్‌లో కష్టపడ్డ వారికి తగిన గుర్తింపు
- ఏఐసీసీ పరిశీలకుడు దేబాసిస్ పట్నాయక్

మహబూబాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఏఐసీసీ అధినేత రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పని చేయాలని ఏఐసీసీ పరిశీలకుడు దేబాసిస్ పట్నాయక్ పిలుపునిచ్చారు. డీసీసీ అధ్యక్షుడి ఎంపిక ప్రక్రియలో భాగంగా మహబూబాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రెండోరోజు బుధవారం కాంగ్రెస్ ముఖ్య నాయకులు, మండల అధ్యక్షులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో కష్టపడ్డ ప్రతీ ఒక్కరికి తగిన గుర్తింపు ఉంటుందని చెప్పారు. కాంగ్రెస్ కార్యకర్తల మనోభీష్టం మేరకు పార్టీ కోసం పని చేసిన వారిని డీసీసీ అధ్యక్షులుగా ఎంపిక చేయడం కోసం అభిప్రాయ సేకరణ చేస్తున్నట్లు తెలిపారు. అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి కాంగ్రెస్ కార్యకర్తలు పనిచేసి రాబోయే రోజుల్లో కేంద్రంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావాలని కోరారు. ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, టీపీసీసీ పరిశీలకులు ఎమ్డీ. అవేజ్, శ్రీకాంత్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అజ్మీర సురేష్‌నాయక్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బోడ రవినాయక్ పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులోకి పాస్‌పోర్ట్ సేవలు

మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్

మహబూబాబాద్ రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు పాస్‌పోర్ట్ సేవలు అందుబాటులోకి వచ్చాయని మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్ తెలిపారు మానుకోట. జిల్లా కేంద్రంలోని పాస్‌పోర్ట్ సేవ కేంద్రంలో ఆయన బుధవారం పాస్‌పోర్ట్ రెన్యూవల్ చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 సంవత్సరంలో తాను ఎంపీగా ఉన్నప్పుడు కేంద్రప్రభుత్వంతో మాట్లాడి మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో పాస్‌పోర్ట్ కేంద్రాన్ని మంజూరు చేయించానని చెప్పారు. ఈ కేంద్రం ద్వారా నేటి వరకు సుమారు 35,963 మంది పాస్‌పోర్టులు పొందారని తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలు గతంలో హైదరాబాద్ వెళ్లి పాస్‌పోర్టుకు దరఖాస్తులు చేసుకునేవారిని, దీంతో ఇబ్బందులు పడేవారని, ఇప్పుడు ఆ పరిస్థితిలేదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు క్యాచువల్ శ్యాంసుందర్ శర్మ, ధార ఇందుభారతి, భద్రయ్య, రేష్మా, మల్లం యశ్వంత్, రవి యాదవ్, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.



మానుకోటలో మాట్లాడుతున్న సీతారాంనాయక్

ఊపందుకుంటున్న మద్యం టెండర్ల దరఖాస్తులు

నెహ్రూసెంటర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లాలోని 61 మద్యం షాపులను దక్కించుకునేందుకు ఆశావహుల నుంచి దరఖాస్తులు ఊపందుకుంటున్నాయని మహబూబాబాద్ ఎక్సైజ్ సీఐ జి.చిరంజీవి పేర్కొన్నారు. బుధవారం మహబూబాబాద్ ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలో 20, గూడూరు ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలో 06, తొర్రూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 18 దరఖాస్తులు నమోదయ్యాయి. వెరసి జిల్లా వ్యాప్తంగా ఒక్కరోజు 44 దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 168 దరఖాస్తులు వచ్చాయమన్నారు. మద్య టెండర్ల గడువు మరో మూడ్రోజుల్లో ముగియనుండడంతో ఈ మూడు రోజులు దరఖాస్తుల సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు

- జిల్లాలో 242 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్



వీసీలో పాల్గొన్నఅద్వైత్‌కుమార్‌సింగ్, అధికారులు

మహబూబాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు కలుగకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ తెలిపారు. హైదరాబాద్ సచివాలయం నుంచి రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖమంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, మంత్రి వాకాటి శ్రీహరి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణరావు ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాట్లు, నిర్వహణపై జిల్లా కలెక్టర్లు, సంబంధిత అధికారులతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని వారు సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అద్వైత్‌కుమార్‌సింగ్ జిల్లా అధికారులతో సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ, రవాణా, గన్నిసంచులు, టార్పాలీన్లు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఎలాంటి నిర్లక్ష్యం వహించినా సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో ఐకేపీ 59, పీఏసీఎస్ 168, గిరిజన కార్పొరేషన్ 13, మెప్మా 02 మొత్తంగా 242 ధాన్యం కొనుగోలు కేంద్రాలద్వారా రైతులు పండించిన ధాన్యాన్ని సేకరించేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు. పౌరసరఫరాలు, సహకార, వవ్యవసాయ, లీగల్ మెట్రాలజీ తదితర అన్ని విభాగాల సిబ్బందిని సమన్వయ పరిచి ధాన్యం కొనుగోళ్లను విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. రైతుల సౌకర్యార్థం కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోలుపై ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, కేంద్రాల వద్ద రైతుల కోసం తాగునీరు, మెడికల్ క్యాంపు సౌకర్యం కల్పించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్ టొప్పొ, కె.అనిల్‌కుమార్, జిల్లా అధికారులు మధుసూదనరాజు, వెంకటేశ్వర్లు, ప్రేమ్‌కుమార్, కృష్ణవేణి, విజయనిర్మల, విజయ, దేశీరాం, జైపాల్‌రెడ్డి, యాదగిరి పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి

మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మహబూబాబాద్ గిరిజన భవనంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం పోషణ మాసోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన భూక్య మురళీనాయక్ మాట్లాడుతూ గర్భిణీలకు రక్తహీనత సమస్య రాకుండా ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ డెలివరీలు అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. చిన్నారులకు పోలియో, ఇతర టీకాలు సమయానికి ఇప్పించి పోలియో రహిత, ఆరోగ్య తెలంగాణ నిర్మాణానికి కృషి చేయాలన్నారు. అదే విధంగా చిన్నపిల్లలను పనిలో ఉండకుండా బడిలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. గర్భిణీలకు, పిల్లలకు గుడ్లు, పాలు,పప్పు దినుసులు, బాలామృతం (మిగతా 10వ పేజీలో)



పోషణ్ మాసోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

ఘనంగా ఆంధ్రజ్యోతి 23వ వార్షికోత్సవం



మడికొండ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి దినపత్రిక 23వ, ఏబీఎన్ న్యూస్ చానెల్ 16వ వార్షికోత్సవం మడికొండలోని ఆంధ్రజ్యోతి వరంగల్ యూనిట్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ వర్దినేని రఘుపతిరావు, ఎడిషన్ ఇన్‌చార్జి శంకర్‌రావు శెంకేసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు నేలపై గత రెండు దశాబ్దాలుగా ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ ప్రజల పక్షం వహిస్తూ వారి హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నాయని తెలిపారు. నిబద్ధత, నిర్భీతి ఊపిరిగా ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ ప్రస్థానం నిరంతరం సాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీఎన్ ఇన్‌చార్జి దొంతు నవీన్, ప్రొడక్షన్ రీజనల్ మేనేజర్ బైరి అజయ్‌కుమార్, యాడ్స్ మేనేజర్ మాటేటి రమేశ్, సర్కులేషన్ మేనేజర్ షరీఫ్, సిస్టమ్స్ ఇన్‌చార్జి చక్రధర్, సబ్ ఎడిటర్లు, వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

కిసాన్ కపాస్ యాప్‌పై అవగాహన పెంచుకోవాలి

దంతాలపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లక్ష్మీపురంలో బుధవారం కేంద్ర ప్రభుత్వం సహకారంతో ప్రారంభించిన కిసాన్ కపాస్ యాప్‌పై ప్రజల్లో విస్తృత అవగాహన పెంచుకోవాలని వ్యవసాయాధికారి వాహిని అన్నారు. ఈ సందర్భంగా ఆమె మండలంలోని రేపోణి, లక్ష్మీపురం గ్రామాల్లోని వివిధ రైతులకు చెందిన పత్తి పంటలను పరిశీలించారు. రైతులు పత్తి విక్రయానికి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ప్రభుత్వం కిసాన్ కపాస్ యాప్‌ను అమలులోకి తెచ్చిందన్నారు. రైతులు తమ మొబైల్ ద్వారా యాప్‌లో స్లాట్ బుక్ చేసుకొని మిల్లుల వద్దకు తీసుకురావాలన్నారు. తద్వారా సరైన రైతులకు ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధర లభిస్తుందన్నారు. రైతులు మధ్య దళారులకు విక్రయం జరపకుండా నేరుగా యాప్ ద్వారా మాత్రమే పత్తి విక్రయం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు దీక్షిత్‌కుమార్, ఉదయ్ కిరణ్, శిరీష తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై గ్రామ సభలు

దంతాలపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 17 గ్రామ పంచాయతీలో ఈ నెల 15 నుంచి ఇంటింటా ఉపాధి హామీ పనుల నిర్వహణపై సర్వే నిర్వహణ అనంతరం గ్రామ సభను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో విజయ అన్నారు. బుధవారం ఆమె మండల కేంద్రంలో మాట్లాడుతూ 2023-24కు సంబంధించిన పనులకు ఈ నెల 15న ఆగాపేట, 16న వేములపల్లి, పెద్దముప్పారం, బీరిశెట్టిగూడెం 17న దంతాలపల్లి, 18న తూర్పుతండా, 19న వాల్యతండా, దొనకొండ, 21న గున్నేపల్లి, దాట్ల, బొడ్లాడ, 22న రామవరం, లక్ష్మీపురం, నిదానపురంలో గ్రామ సభలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా, మండల ఓపెన్ ఫోరంను ఈ నెల 23న మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఓపెన్ ఫోరానికి ఉపాధి హామీ పీడీతో పాటు సంబంధిత అధికారులు హాజరవుతారన్నారు.

మరిపెడ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధి అంగన్‌వాడీ యూనియన్ ఎన్నిక


లలిత


జ్యోతి

మరిపెడ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మరిపెడ ఐసీడీఎస్ పరిధి అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలిగా సమ్మెట లలిత, ప్రధాన కార్యదర్శిగా కుమ్మరికుంట్ల జ్యోతి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు బెస్త సంపూర్ణ తెలిపారు. బుధవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మరిపెడ ఐసీడీఎస్ పరిధిలోని మరిపెడ, చిన్నగూడూరు, నర్సింహులపేట, దంతాలపల్లి మండలాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు మరిపెడ ఆడిటోరియం కం ఇండోర్ స్టేడియంలో మహాసభ నిర్వహించి నూతన కమిటీని ఎన్నికున్నట్లు సంపూర్ణ పేర్కొన్నారు. ఉపాధ్యక్షురాలిగా ఉమ, సహాయ కార్యదర్శిగా మంజుల, కోశాధికారిగా మూల్యా జ్యోతి, కార్యవర్గ సభ్యులుగా కళమ్మ, పుష్ప ఎన్నికయ్యారన్నారు. తమ ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ లలిత, జ్యోతి కృతజ్ఞతలు తెలిపారు.

మానవత్వం పరిమళించిన వేళ..

- శునకానికి చికిత్స

పెద్దవంగర, అక్టోబర్ 15 (ఆంధ్రజ్యోతి) : చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న శునకానికి యువకులు ప్రాణాపాయ స్థితిలో ఉన్న శునకానికి సకాలంలో చికిత్స అందించి మానవత్వం చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని పోచంపల్లి గ్రామ శివారులోని యేనేమిదితండాలో బుధవారం ఓ వీధికుక్క ఏదో విషపదార్థాన్ని తిని తీవ్ర అస్వస్థతకు గురైంది. నిమిషాల వ్యవధిలోనే శునకం కుప్పకూలి, చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతోంది. అదే తండాకు చెందిన యవకుడు బానోతు చరణ్, అవుతాపురం పశువైద్య సహాయకుడు వాంకుడోతు అనిల్‌నాయక్‌తో కలిసి ప్రాణాపాయ స్థితిలో ఉన్న శునకానికి చికిత్స అందించి ప్రాణాలను కాపాడి మానవత్వం చాటుకున్నారు.

పారదర్శకంగా డీసీసీ అధ్యక్షుడి ఎన్నిక

- స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి
- ఏఐసీసీ పరిశీలకుడు దేబాసిస్ పట్నానాయక్


సమావేశంలో మాట్లాడుతున్న దేబాసిస్ పట్నానాయక్

తొర్రూరు, అక్టోబర్ 15 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడి ఎన్నిక పారదర్శకంగాఉంటుందని, పార్టీ అభివృద్ధి కోసం కృషి చేసే వారినే నియమిస్తామని ఏఐసీసీ పరిశీలకుడు దేబాసిస్ పట్నానాయక్ అన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి ఆధ్వర్యంలో సృజన్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు పారదర్శంగా ప్రజాస్వామయుతంగా డీసీసీ అధ్యక్షుడిని ఎంపిక చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి శ్రేణుల్లో ఉత్సాహం కల్పించేందుకు మీనాక్షి నటరాజు కొత్తకొత్త కార్యక్రమాలను శ్రీకారం చుడుతున్నారని తెలిపారు. ప్రజాస్వామ్యయుతంగా పార్టీ నాయకులు, కార్యకర్తల మనోభావాలను అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని డీసీసీ అధ్యక్షుడిని నియమిస్తారని స్పష్టం చేశారు. డీసీసీ అధ్యక్షుడి నియామకం తర్వాత బ్లాక్ మండలం, గ్రామస్థాయి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ఎంపిక నిర్వహిస్తామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపిస్తోందని, ప్రతీ గ్రామంలో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. ప్రతీ పేదవాడికి సొంత ఇంటికల నెరవేర్చిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గ్రామాల అభివృద్ధి కోసం ప్రజలంతా స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని, అప్పుడే గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతాయన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందిస్తామని తెలిపారు. ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న సర్కారుపై ప్రతిపక్షాలు కుట్రలు పన్నుతున్నాయని వాటిని తిప్పికొట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. మండల స్థాయి, గ్రామస్థాయి నాయకులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అబ్జర్వర్లు ఎమ్డీ.అవేజ్, శ్రీకాంత్‌యాదవ్, అరుణ్‌కుమార్, డీసీసీ అధ్యక్షులు భరత్ చందర్‌రెడ్డి, ఆయా మండల అధ్యక్షులు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే ఐసీడీఎస్ లక్ష్యం


పిల్లలకు అక్షరాభ్యాసం చేయిస్తున్న అధికారులు

మరిపెడ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్య వంతమైన సమాజ నిర్మాణమే ఐసీడీఎస్ శాఖ లక్ష్యమని మరిపెడ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారిణి ఎల్లమ్మ అన్నారు. బుధవారం మరిపెడలోని ఆడిటోరియం కం ఇండోర్ స్టేడియంలో ఐసీడీఎస్ పోషణ్ మాసోత్సవాల ముగింపు సందర్భంగా మరిపెడ ప్రాజెక్ట్ పరిధిలోని మరిపెడ, చిన్న గూడూరు, నర్సింహులపేట, దంతాలపల్లి మండలాలకు చెందిన వివిధ గ్రామాల అంగన్‌వాడీ సెంటర్ల నిర్వాహకులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. మరిపెడ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎల్లమ్మ పాల్గొని మాట్లాడారు. అనంతరం ఆయా గ్రామాల పరిధిలోని పిల్లలకు సామూహిక అక్షరాభ్యాసం, అన్న ప్రాసన్నం, గర్భిణులకు ప్రత్యేకంగా సీమంతాలు జరిపారు. ఈ సందర్భంగా మరిపెడ ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి, మెడికల్ ఆఫీసర్ గుగులోత్ రవి, ఎంపీవో సోమ్లానాయక్ పోషకాలతోనే సంపూర్ణ ఆరోగ్యంతో ప్రతీ ఒక్కరు ఉంటారని గుర్తు చేశారు. అంగన్‌వాడీ టీచర్లచే అధికారులు ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఉష, రాణి, రాజ్యలక్ష్మి, శ్రీలత, శ్రీదేవి, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు. కాగా టీచర్లు వివిధ రకాల పోషక విలువలతో కూడి ఉన్న పదార్థాలను తయారు చేసి తీసుకొచ్చారు.

బాల్య మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం

మరిపెడ రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం అబ్బాయిపాలెంకు చెందిప బాషింగు గురవయ్య (45) ఇటీవల అనారోగ్య కారణాలతో అకాల మరణం పొందాడు. సాధారణ రైటర్‌గా జీవనాన్ని కొనసాగిస్తున్న గురవయ్య అకాల మరణం చెందడంతో కుటుంబానికి పెద్ద దిక్కును కోల్పోయింది. దీంతో 1992-93 విద్యా సంవత్సరంలో మరిపెడ హై స్కూల్‌లోని బాల్య మిత్రులు స్పందించి గురవయ్య కుటుంబానికి రూ.10 వేలు విలువైన నిత్యావసర సరుకులను అందజేశారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు. పూర్వ విద్యార్థులైన మారం అనంతరాములు, గంధశిరి లక్ష్మయ్య, గంధశిరి చిన్నక్క, సులోచన, బొలగాని శ్రీను, ఉమాదేవి, సూరబోయిన రమేశ్, షేక్ రహీం, గంధశిరి వెంకన్న, ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

అబ్బాయిపాలెంలో ఉచిత వైద్యశిబిరం

మరిపెడ రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీవో సోమ్లాల్ అన్నారు. బుధవారం మండలంలోని అబ్బాయిపాలెం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు 40 మంది రోగులను పరీక్షించి, మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈవో కృష్ణ, ఎంఎల్‌హెచ్‌పీ తరుణి, ఆశా వర్కర్ల్ మాధవి, గణిత, జ్యోతి పాల్గొన్నారు.

బీసీ బంద్‌ను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గుండగాని వేణు

మరిపెడ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : 42శాతం బీసీ రిజర్వేషన్ల అమలు కోసం బీసీ జేఏసీ పిలుపు మేరకు ఈ నెల 18న చేపట్టనున్న బీసీ బంద్‌ను జిల్లా వ్యాప్తంగా విజయవంతం చేయాలని మహబూబాబాద్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, బీసీ జేఏసీ జిల్లా కన్వీనర్ గుండగాని వేణు పిలుపు నిచ్చారు. బుధవారం ఆయన మరిపెడ విలేకరులతో మాట్లాడుతూ బీసీలకు దక్కాల్సిన రిజర్వేషన్లు దక్కకుండా కొన్ని వర్గాలు కుట్రలు చేస్తున్నట్లు ఆరోపించారు. మన వాట రిజర్వేషన్లు మనకు దక్కేవరకు బీసీలందరు కలిసికట్టుగా పోరాటాలు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆ సంఘం మరిపెడ మండల నాయకులు రాంపెల్లి అబ్బయ్య, బీఎస్.రాజు, ఉప్పల రమేశ్, కొత్తకొండ భరత్, రాంచంద్రయ్య, పవన్, సాయి, లింగమూర్తి, అర్జున్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లలోకి ప్రవేశానికి యత్నం

- అడ్డుకున్న రెవెన్యూ అధికారులు
- అర్హులకు ఇవ్వాలని ధర్నా


రెవెన్యూ అధికారులతో వాగ్వాదం చేస్తున్న లబ్ధిదారులు

తొర్రూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : తొర్రూరు పట్టణంలో నిర్మించి ఉన్న 284 డబుల్ బెడ్‌రూం ఇళ్లను అర్హులైన వారందరికీ ఇవ్వాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో లబ్ధిదారులు గత కొన్ని రోజులుగా దీక్షలు చేపట్టారు. బుధవారం ఇళ్లలోకి చొరబడి ఆక్రమించుకునేందుకు ప్రయత్నం చేశారు. దీంతో పోలీసులు, రెవెన్యూ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని బయటకు పంపారు. రెవెన్యూ అధికారులతో లబ్ధిదారులు వాగ్వాదం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొల్లం అశోక్, యాకుబ్ మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా అర్హులకు నిర్మించిన ఇండ్లు అందించాలని దీక్షలు చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఇళ్ల కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎమ్డీ.యాకూబ్, యాకయ్య, స్వామి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

పశువులకు టీకాలు వేయించుకోవాలి

మరిపెడ రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలని పశువైద్యాధికారి మనోహర్ కృష్ణకుమార్ తెలిపారు. బుధవారం మండలంలోని ఎడ్జర్లలో ఆయన మాట్లాడారు. మూడు నెలలకు పైబడిన లేగలు, దూడలకు, చూడి పశువులకు టీకాలు సురక్షితం అన్నారు. బుధవారం నుంచి వచ్చే నెల 14వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. నాలుగు టీంలుగా మండలంలో పని చేస్తాయన్నారు.

ముగిసిన మండలస్థాయి క్రీడా పోటీలు

బయ్యారం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : బయ్యారం జడ్పీ హైస్కూల్లో రెండు రోజులపాటు నిర్వహించిన మండల స్థాయి అండర్ 14, 17 కబడ్డీ, ఖోఖో, వాలీ బాల్ క్రీడాపోటీలు బుధవారం ముగిశాయి. ఆయా పాఠశాలల బాల, బాలికల విజేత టీంలకు ఎంఈవో దేవేంద్రాచారి షీల్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం లింగరాజు, కోటయ్య, పీడీలు సునీత, అరుణ, రామయ్య పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో తహసీల్దార్ తనిఖీ


గురుకులంలో భోజనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ నాగరాజు

బయ్యారం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఇర్సులాపురం ఆశ్ర మ పాఠశాలలో బుధవారం కలెక్టర్ ఆదేశాల మేరకు మధ్యాహ్న భోజనం నాణ్యతను తహసీల్దార్ నాగరాజు తనిఖీ చేశారు. భోజనం నాణ్యతపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంఆర్ఐ సందీప్, హెచ్‌ఎం శోభన్‌బాబు, వార్డెన్ లాలయ్య ఉన్నారు.

వాలీబాల్ పోటీలకు పొనుగోడు విద్యార్థి


ఈశ్వర్‌ను అభినందిస్తున్న జడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయులు

గూడూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి వాలీబాల్ క్రీడలకు పొనుగోడు జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలకు చెందిన విద్యార్థి ఆంగోతు ఈశ్వర్ ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం చింత అర్జున్‌రావు, స్పోర్ట్స్ ఇన్‌చార్జి పూల్‌సింగ్ తెలిపారు. ఇటీవల కాలంలో వరంగల్‌లో నిర్వహించిన వాలీబాల్ క్రీడల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ఈశ్వర్‌ను పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు.

ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేష్, అశోక్, నర్సింహా, రేణుక, కుమార్, మల్లేశం, మధు, నాగరాజు, రమేష్, నవీన్, శిరీష, ప్రియాంక, యాకలక్ష్మి, సుమలత పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలకు నేరడ మోడల్ స్కూల్ విద్యార్థిని..

కురవి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కురవి మండలం నేరడ మోడల్‌స్కూల్‌కు చెందిన బి.జ్యోత్స్న అండర్ -14 కబడ్డీ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ నెల 14న ములుగు జిల్లా జాకారం గురుకులంలో జరిగిన ఎస్‌జీఎఫ్ఐ అం డర్-14 బాలికల కబడ్డీ విభాగంలో ప్రతిభ చూపిన జ్యోత్స్న రాష్ట్ర జట్టుకు ఎంపికైంది. ఈ నెల 16 నుంచి 18 వరకు సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జ్యోత్స్న పాల్గొంటోంది. జ్యోత్స్నను బుధవారం పాఠశాలలో ప్రిన్సిపల్ వై.శ్రీకాంత్, పీడీ సురేష్ అభినందించారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలి


మహబూబాబాద్ అంబేద్కర్ విగ్రహం ఎదుట ఆందోళన చేస్తున్న బీసీ హక్కుల సాధన సమితి నేతలు

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని బీసీ హక్కుల సాధన సమితిజిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చొప్పరి శేఖర్, పెరుగుకుమార్ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల అంశాన్ని 9వ షెడ్యూల్ చేర్చి 42 శాతం ప్రకటించాలని డిమాండ్ చేస్తూ బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...బీసీలకు చట్టబద్ధంగా 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర శాసనసభలో తీర్మాణం చేసి కేంద్రానికి పంపిన ఇప్పటి వరకు బీజేపీ సర్కార్ పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కేంద్రంపై ఒత్తిడి పెంచాలన్నారు. కాగా ఆందోళనకు సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బి. అజయ్‌సారధిరెడ్డి సంఘీభావం ప్రకటించారు. ఈకార్యక్రమంలో రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, వరిపెల్లి వెంకన్న, శ్రావణ్, ఫాతిమా, రమేష్, శ్రీను, శ్యాం ప్రసాద్, పద్మ, శంకర్, శ్రీనాద్, రఫీ, మాధవి, ఐలయ్య, భద్రయ్య పాల్గొన్నారు.

ట్రస్మా మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్

కురవి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కురవి మండల ప్రైవేట్ పాఠశాలల సంఘం (ట్రస్మా) మండల అధ్యక్షుడిగా సరస్వతి విద్యాలయం కరస్పాండెంట్ ఆర్.శ్రీనివాస్ ఎన్నికయ్యారు. కార్యదర్శిగా గీతాంజలి స్కూల్ ప్రిన్సిపాల్ జలిక శ్రీనివాస్, ట్రెజరర్‌గా కరుణశ్రీ స్కూల్ ప్రిన్సిపాల్ యాదగిరి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సిద్ధార్థస్కూల్ ప్రిన్సిపాల్ అలువాల కార్తీక్, నాగార్జున స్కూల్ కరస్పాండెంట్ భూక్య రవికుమార్, వీఆర్ఎస్ ఫౌండేషన్ స్కూల్ కరస్పాండెంట్ రాము పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం


ఎంచగూడెంలో బియ్యం అందజేస్తున్న యూత్ సభ్యులు

కొత్తగూడ, అక్టోబర్ 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎంచగూడెంలో ఇటీవల బావిలో పడి మృతి చెందిన ఇటికాల రితిక్ కుటుంబానికి చెగువేరా యువజన సంఘం సభ్యులు ఆర్థిక సాయం చేశారు. 50కిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో శ్రీకాంత్, నరేష్, రంజిత్, హరీష్, సిద్ధు పాల్గొన్నారు. ఎంచగూడెం గ్రామస్తులు రితిక్ కుటుంబానికి రూ.31,674 అందజేశారు.

లక్ష్యాన్ని ఎంచుకుని చదవాలి


కాంపెల్లిలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కోట కిశోర్‌బాబు

కురవి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని చదవాలని మోటివేటర్ కోట కిశోర్‌బాబు అన్నారు. సీరోలు మండలం కాంపెల్లిలో ఇండియా లిటరసి ప్రాజెక్టు ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్ ప్రోగ్రాంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు వివిధ కోర్సులు, విద్యావకాశాలపై అవగాహన కల్పించారు. కోలాండ్ కోడ్ యాక్టివిటిని విద్యార్థులు అనుసరించాలని, ఈ యాక్టివిటి ద్వారా విద్యార్థులు ఏరంగంలో ఆసక్తిగా ఉన్నారో తెలుస్తుందని, తదనుగుణంగా వారి భవిష్యత్‌ను నిర్మించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం. డోలి అరుణ పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల కోసం ఐక్యంగా ఉద్యమించాలి

జిల్లా బీసీ నాయకులు పెద్దకాసు కుమారస్వామి


కొత్తగూడలో మాట్లాడుతున్న పెద్దకాసు కుమారస్వామి

కొత్తగూడ, అక్టోబర్ 15 (ఆంధ్రజ్యోతి) : బీసీ రిజర్వేషన్ల కోసం ఐక్యంగా ఉద్యమించాలని, ఈనెల 18న నిర్వహించతలపెట్టిన రాష్ట్ర వ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలని జిల్లా బీసీ నాయకులు పెద్ద కాసు కుమారస్వామి, నూకల సురేందర్ పిలుపునిచ్చారు. కొత్తగూడలో బుధవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో బీసీ సీనియర్ నాయకుడు కొమ్మనబోయిన వేణు, నాయకులు బండి మల్లేష్, ఈరబోయిన అశోక్, అల్లాడి రాజు, దానం వెంకన్న, పడాల నాగేశ్వరరావు, కుసుమ రాజన్‌బాబు, గుళ్లపల్లి శ్రీనివాస్, పెంతల శ్రీనివాస్, ముదురు మల్లయ్య, దయ్యాల సదానందం, కంచర్ల సత్యం, రాపాక బ్రహ్మచారి, కొలిపాక సదానందం, నాగవెల్లి భిక్షపతి, శోభన్, గంగారపు భిక్షపతి పాల్గొన్నారు.


ఏబీఎన్-ఆంధ్రజ్యోతి వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని కొత్తగూడలో కేక్ కట్ చేస్తున్న విద్యార్థినులు

- ఆంధ్రజ్యోతి, కొత్తగూడ


ఎల్కతుర్తిలోని ఓ గ్రానైట్ కటింగ్ కంపెనీ

బండ బారుతున్న జీవితాలు

- గ్రానైట్ కటింగ్ ఇండస్ట్రీతో పొంచి ఉన్న ప్రమాదం
- నిబంధనలు పాటించని కంపెనీలు
- దుమ్ము, శబ్దంతో వాతావరణం కలుషితం
- బావుల్లో అడుగంటిన నీరు
- పట్టించుకోని సంబంధిత అధికారులు

ఎల్కతుర్తి, అక్టోబరు 15 (ఆంధ్ర జ్యోతి): మండల పరిధిలో నిర్మించిన గ్రానైట్ ఫ్యాక్టరీలతో ఈ ప్రాంతానికి ప్రమాదం పొంచి ఉంది. మిషన్ల శబ్దం, దుమ్ముతో పర్యావరణం దెబ్బతింటుంది. పంటలూ దెబ్బతిని రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. ఫ్యాక్టరీల నుంచి వెలువడే దుమ్ముధూళితో ఈ ప్రాంత ప్రజలు శ్వాసకోస సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారు. నిత్యం పచ్చదనంతో ఉండే ప్రాంతంలో మొక్కలు మొలకెత్తని దుస్థితి నెలకొంది. ఫ్యాక్టరీస్ నిర్వాహకులు నిబంధనలు పాటించక పోవడంతో ఈ ప్రాంతానికి భారీ ప్రమాదం పొంచి ఉంది.

సాగుకు అనువైన భూముల్లో పరిశ్రమలు

వ్యవసాయ సాగుకు అనువైన భూముల్లో గ్రానైట్ కటింగ్ ఫ్యాక్టరీలు ఏర్పాటు చేశారు. అధికారులు, వ్యాపారులు ఇచ్చిన మాముళ్లకు కక్కుర్తి పడి విచ్చలవిడిగా అనుమతులు ఇవ్వడంతో ఈ ప్రాంత ప్రజలు, రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఫ్యాక్టరీల నిర్మాణాలను పరిశీలించకుండానే గోరంత అనుమతులతో కొండంత విస్తీర్ణంలో నిర్మాణాలు చేపట్టారు. కొన్ని ఫ్యాక్టరీలకు సరైన అనుతులు లేకుండానే యథేచ్ఛగా వ్యాపారాలు సాగిస్తున్నారు.

అడుగంటిన భూగర్భ జలాలు

వాల్టా చట్టాన్ని అమలు చేయాల్సిన అధికారులు గ్రానైట్ కటింగ్ కంపెనీ వ్యాపారులకు కొమ్ముకాస్తున్నారు. వాణిజ్య, పారిశ్రామిక ఉపయోగాలకు బోరు వేయడానికి రాష్ట్ర భూగర్భ జల విభాగం (సెంట్రల్ గ్రౌండ్ వాటర్ అథారిటీ) నుంచి తప్పనిసరిగా అనుమతులు పొందాలి. వ్యవసాయాధారిత ప్రాంతాల్లో కేవలం 160 ఫీట్లుకు పైగా బోరు వేస్తే చుట్టు పక్కల ఉన్న వ్యవసాయ బావుల్లో నీరు అడుగంటి పోయే ప్రమాదం ఉంది. ఎలాంటి అనుమతులు పొందకుండానే ఒక్కొక్క కంపెనీలో వెయ్యి ఫీట్ల లోతుకు పైగా బోర్లు వేశారు. గ్రానైట్ కటింగ్ మిషన్‌కు నిత్యం నీరు అవసరం ఉండడంతో నిరంతరాయంగా బోర్లతో నీటిని తోడేస్తున్నారు. దీంతో కిలోమీటర్ల దూరంలో ఉన్న వ్యవసాయ బావుల్లో సైతం నీరు అడుగంటి పోయింది. కంపెనీల తీరుపై పొల్యూషన్ నియంత్రణ, రెవెన్యూ, ట్రాన్స్‌పోర్టు అధికారులకు స్థానికులు గతంలో ఫిర్యాదు చేశారు. పరిశ్రమలను తనిఖీ చేసి వారిచ్చే మాముళ్ల తీసుకుని జారుకుంటున్నారే తప్ప ఏ ఒక్క కంపెనీపై చర్యలు తీసుకోవడం లేదని రైతులు మండిపడుతున్నారు.

40కి పైగా గ్రానైట్ కటింగ్ పరిశ్రమలు

ఎల్కతుర్తి, గోపాల్‌పూర్, సూరారం గ్రామాల శివారు వ్యవసాయ భూములను కొందరు కొనుగోలు, మరికొందరు లీజుకు తీసుకుని 38 గ్రానైట్ కటింగ్ పరిశ్రమలను ఏర్పాటు చేశారు. గజాల్లో వ్యవసాయ భూములను నాలా (నాన్ అగ్రికల్చర్ ల్యాండ్) కన్వర్షన్ చేయించుకుని ఎకరాల విస్తీర్ణంలో అధికారుల అండదండలతో నిర్మాణాలు చేపట్టారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడిందని నిపుణులు చెబుతున్నారు. కొన్ని పరిశ్రమలు నిర్మించిన భూములకు రైతు భరోసా డబ్బులు పడుతున్నాయని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు.


గ్రానైట్ కోసం వచ్చే లారీతో చెలరేగుతున్న దుమ్ము

శబ్ద కాలుష్యం

అమావాస్య రోజు మినహా ప్రతిరోజూ 24 గంటల పాటు గ్రానైట్ కంపెనీల్లో కటింగ్ మిషన్లు నిరంతరంగా నడుస్తున్నాయి. వాటి ద్వారా వచ్చే శబ్దానికి చుట్టు పక్కల రైతులు, పక్కనే ఉపాధి పొందుతున్న గీత కార్మికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఒక కటింగ్ మిషన్ ద్వారా 100 నుంచి 105 డీబీ (డెసిబుల్) శబ్దం ఉత్పన్నమవుతుంది. 40 కంపెనీల్లో యంత్రాల ద్వారా వచ్చే శబ్దాన్ని ప్రజలు భరించలేకపోతున్నారు. శబ్దం బయటకు రాకుండా ఏర్పాట్లు చేయాల్సిన ఫ్యాక్టరీల నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.

దెబ్బతింటున్న పంటలు

గ్రానైట్ కటింగ్ అలాగే పెద్ద బండలను తీసుకెళ్లే లారీల రాకపోకలతో వచ్చే దుమ్ము ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. ఈ ప్రాంతంలో ఎక్కడ చూసినా దుమ్ము దర్శనమిస్తుంది. కటింగ్ ద్వారా వచ్చే దుమ్మును ఎక్కడ పడితే అక్కడే పడేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతంలో మొక్కలు సైతం మొలకెత్తని పరిస్థితి నెలకొంది. పంటలపై దుమ్ము పడి దెబ్బతింటున్నాయి. దిగుబడి రాక రైతులు నష్టపోతున్నారు. కంపెనీలు దుమ్ము చెలరేగకుండా చర్యలు చేపట్టడం లేదు. కంపెనీలకు పక్కనే ఎన్‌హెచ్ - 563 ప్రధాన రహదారి ఉండడంతో అటుగా వెళ్లే వాహనదారులు సైతం దుమ్ముతో ఇబ్బంది పడుతున్నారు.

నియంత్రణ చర్యలు శూన్యం

ప్రమాదాలను నివారణకు అధికారులు, నిర్వాహకులు చర్యలు తీసుకోవడం లేదు. నిబంధనలు పాటించని కంపెనీలపై చర్యలు తీసుకోకపోవడంతో నిర్వాహకులకు అడ్డు అదుపు లేకుండా పోయింది. తనిఖీ చేయాల్సిన అధికారులు నెలవారీ మాముళ్ల ముట్టడంతో కిమ్మనకుండా ఉంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కంపెనీల తీరుపై ఫిర్యాదు చేస్తే అది అధికారులకు వరంగా మారుతుంది. ఈ వంకతో పెద్ద మొత్తంలో డబ్బులు దండుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అవినీతికి పాల్పడుతున్న సంబంధిత అధికారులు, నిబంధనలు పాటించని గ్రానైట్ కంపెనీల యజమానులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సత్యశారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి అధికారులు

ధాన్యం సేకరణ సజావుగా సాగాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు

వరంగల్ కలెక్టరేట్, అక్టోబరు 15 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఆదేశించారు. బుధవారం వారు హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లతో ధాన్యం సేకరణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఏ గ్రేడ్ ధాన్యం క్వింటాల్‌కు రూ. 2389, సాధారణ రకానికి రూ. 2369 చొప్పున మద్దతు ధర చెల్లిస్తున్నట్లు తెలిపారు. సన్న రకానికి రాష్ట్ర ప్రభుత్వం అదనంగా రూ. 500 చొప్పున బోనస్ అందిస్తున్నందున ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడికి ధాన్యం తరలించే అవకాశం ఉందని, దాన్ని అరికట్టేందుకు తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ విషయంలో పోలీసులు, జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ధాన్యం విక్రయించిన 48 గంటల వ్యవధిలో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేలా చూడాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ.. జిల్లాలో ఈసారి వానాకాలంలో 3.15 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేశామని, అందుకోసం 258 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు. ధాన్యం సేకరణ సజావుగా జరిపేలా చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాకు 1200 అదనపు టార్పాలిన్లు కేటాయించాలని ఈ సందర్భంగా కలెక్టర్ కోరారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జడ్పీ సీఈవో రామిరెడ్డి, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి కిష్టయ్య, మేనేజర్ సంధ్యారాణి, జిల్లా వ్యవసాయాధికారి అనురాధ, జిల్లా సహకార అధికారి నీరజ, జిల్లా రవాణా శాఖ అధికారి శోభన్‌బాబు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయాలను తగ్గించాలి

టీజీ ఎన్పీడీసీఎల్ ఆపరేషన్స్ డైరెక్టర్ టి.మధుసూదన్

రాంనగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా ముందుస్తు చర్యలు చేపట్టాలని టీజీ ఎన్పీడీసీఎల్ ఆపరేషన్స్ డైరెక్టర్ టి.మధుసూదన్ అధికారులకు సూచించారు. వరంగల్ సర్కిల్ అధికారులతో బుధవారం ములుగురోడ్డులోని ట్రాన్స్‌కో కార్యాలయం ఆవరణంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ.. లూజ్ లైన్‌లు లేకుండా సరిచేయాలని, వేసవి కాలంలో ఓవర్‌లోడ్ తగ్గించేందుకు అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల కోసం ఇప్పటి నుంచే కార్యాచరణ రూపొందించాలని సూచించారు.

పొలం బాట ద్వారా రైతులకు విద్యుత్ ప్రమాదాలు, విద్యుత్ వినియోగంపై అవగాహన కల్పించాలని సూచించారు. డీటీఆర్ ఫెయిల్యూర్‌లను తగ్గించాలన్నారు. ఫెయిల్యూర్‌లు అయితే సత్వరమే నూతన డీటీఆర్‌లను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆపరేషన్స్ సీఈ రాజు చౌహాన్, వరంగల్ సర్కిల్ ఎస్ఈ గౌతంరెడ్డి, డీఈ టెక్నికల్ ఎ.ఆనందం, వరంగల్ డీఈ మల్లికార్జున్, నర్సంపేట డీఈ తిరుపతి, ఏఎస్వో సంజీవరావు, కన్‌స్ట్రక్షన్ డీఈ హర్ష, సర్కిల్ పరిధిలోని ఏడీఈ, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

బ్యాటరీల చోరీ ముఠా అరెస్ట్



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ రవీందర్ రెడ్డి

నర్సంపేట టౌన్, అక్టోబరు 15 (ఆంధ్ర జ్యోతి) : నర్సంపేట నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో బ్యాటరీ దొంగతనం చేసిన నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఏసీపీ రవీందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా పాలకుర్తికి చెందిన గుంజే సంపత్, ప్రశాంత్, జఫర్‌గఢ్‌కి చెందిన గండికోట మహేష్, బోసు సాంబరాజు అనే నలుగురు వ్యక్తులు గ్రూపుగా ఏర్పడ్డారు. సులువుగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో రాత్రి సమయాల్లో దొంగతనాలు చేయాలని నిర్ణయించుకొని, నర్సంపేట మండలం, చుట్టు పక్కల గ్రామాల్లో సోలార్ లైట్ పోలుకి ఉండే బ్యాటరీలు దొంగతనం చేశారు. గత మూడు నెలలుగా నర్సంపేట మండలంలోని చంద్రయ్యపల్లి, దాసరిపల్లి, బాంజీపేట, రాజేశ్వరరావు పల్లి, ఇటుకాలపల్లి, ఆకులతండా, భోజ్యానాయక్ తండా, మాధన్నపేట, నాగుర్లపల్లి, మహేశ్వరం గ్రామాల్లో దొంగతనం చేసినట్లు ఏసీపీ రవీంధర్ రెడ్డి తెలిపారు. నిందితుల నుంచి 38 బ్యాటరీలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ 2లక్షల 25 వేలు ఉన్నట్లు ఏసీపీ తెలిపారు.

పీసీ నాగరాజుని అభినందించిన ఏసీపీ

నర్సంపేట నియోజకవర్గంలో వరుస దొంగతనాలు జరుపుతున్న నేపథ్యంలో ఎస్సై అరుణ్ ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక టీం ఏర్పాటు చేశారు. బ్యాటరీ దొంగతనం మొదటగా చంద్రాయపల్లిలో చోటు చేసుకుంది. ఈ క్రమంలో గ్రామానికి చెందిన ఓ ఇంటి సీసీ కెమెరాల్లో అనుమానాస్పద వ్యక్తులను గమనించిన కానిస్టేబుల్ నాగరాజు ఆ వైపుగా విచారణ మొదలుపెట్టినట్లు ఏసీపీ తెలిపారు. చాకచక్యంగా వ్యవహరించిన కానిస్టేబుల్ ప్రత్యేకంగా శ్రద్ధ చూపిస్తూ నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనపరిచినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో సదురు కానిస్టేబుల్ నాగరాజుకి రివార్డును సైతం అందజేశారు.

42 శాతం రిజర్వేషన్లు 9వ షెడ్యూల్‌లో చేర్చాలి

18న నిర్వహించే బంద్‌కు మద్దతు - టీజేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శ్రీనివాస్


నర్సంపేటలో మాట్లాడుతున్న అంబటి శ్రీనివాస్

నర్సంపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని తెలంగాణ జన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంబటి శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసిన అనంతరం ఆ రిజర్వేషన్ల అమలుకు రాజ్యాంగ పరమైన అడ్డంకులు ఉన్నాయని, సుప్రీంకోర్టు ముందు రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన తీర్మానం, జీవో 9 కోర్టుల ముందు చెల్లుబాటు కాదనే వాదనలు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. కొన్ని రోజుల కిందట హైకోర్టు దానికి ఊతం కల్పిస్తూ తెలంగాణలో తీసుకువచ్చిన బీసీ రిజర్వేషన్ల జీవోకు స్టే ఇచ్చిందన్నారు. దేశ వ్యాప్తంగా రిజర్వేషన్లపై 50 శాతం సీలింగ్ ఉందన్న చర్చ జరుగుతుందని అన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం తీసుకు వచ్చిన బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లును కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో చట్టం చేసి 9వ షెడ్యూల్‌లో చేర్చాలని తెలంగాణ జన సమితి డిమాండ్ చేస్తుందని అంబటి శ్రీనివాస్ అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల చర్చ కేవలం స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లకు పరిమితం చేయకుండా విద్యా, ఉద్యోగ అవకాశాలకు విస్తరిస్తూ చట్ట సభల్లో కూడా రిజర్వేషన్లు సాధించే దిశగా ఉండాలని ఆయన అన్నారు. బీసీ జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 18న నిర్వహిస్తున్న తెలంగాణ రాష్ట్ర బంద్‌కు తెలంగాణ జన సమితి మద్దతు నిస్తుందన్నారు. ఈ బంద్‌కు ప్రజలు సహకరించాలని కోరారు. కార్య క్రమంలో టీజేఎస్ రాష్ట్ర నాయకులు గుంటి రాంచందర్, బొనగాని రవీందర్, షేక్ జావెద్, ఎలిశాల రాజేశ్, సాంబరాతి మల్లేశం, సొల్తి సాయికుమార్, రామగిరి మాధవి, కాసాని పద్మ, ఎం. రజిత, సంధాని, పండగ శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైభవంగా క్రీడా పోటీలు నిర్వహిస్తాం..

అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ వరద రాజేశ్వర్‌రావు


మాట్లాడుతున్న వరదరాజేశ్వర్‌రావు

వరంగల్ స్పోర్ట్స్, అక్టోబరు 15 (ఆంధ్ర జ్యోతి): జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నుంచి ఈ నెల 18వరకు హనుమకొండ జేఎన్ఎస్‌లో నిర్వహించనున్న 5వ జాతీయస్థాయి అండర్-23మెన్ అండ్ ఉమెన్ అథ్లెటిక్స్ పోటీలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ ఎర్రబెల్లి వరదరాజేశ్వర్‌రావు తెలిపారు. బుధవారం హనుమకొండ జేఎన్ఎస్‌లోని డీఎస్ఏ కార్యాలయంలో జాతీయ స్థాయి అథ్లెటిక్స్ క్రీడా పోటీల నిర్వహణపై ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వరదరాజేశ్వర్‌రావు పాల్గొని మాట్లాడారు. ఈ పోటీలను వరంగల్ ఎంపీ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభిస్తారని తెలిపారు. హనుమకొండలోని జేఎన్ఎస్, నిట్ కళాశాల మైదానాల్లో జాతీయస్థాయిలో నిర్వహిస్తున్న అథ్లెటిక్స్ పోటీల్లో దేశం నలుమూలల నుంచి 937మంది అథ్లెట్లు, 135మంది టెక్నికల్ అఫీషియల్స్, కోచ్‌లు పాల్గొననున్నారని తెలిపారు. అదే విధంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి 25మంది మెన్ అండ్ ఉమెన్ అథ్లెట్లు ప్రాతినిధ్యం వహిస్తారని ఆయన వెల్లడించారు. మూడు రోజుల పాటు జంప్స్, త్రోస్, రన్స్ (ట్రాక్ అండ్ ఫీల్డ్)లో పోటీలు కొనసాగుతాయన్నారు. అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఏఎఫ్ఐ) నిబంధనల మేరకు క్రీడా పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ పోటీల ప్రారంభ కార్యక్రమానికి మేయర్ గుండు సుధారాణి, హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, వరంగల్ పోలీస్ కమిషనర్, సన్‌ప్రీత్‌సింగ్, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్‌బాజ్‌పాయ్‌లు పాల్గొంటారని వరదరాజేశ్వర్‌రావు తెలిపారు. ఈ సమావేశంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి సారంగపాణి, హనుమకొండ డీవైఎస్‌వో గుగులోత్ అశోక్‌కుమార్, అసోసియేషన్ బాధ్యులు, సీనియర్ అథ్లెట్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దొంతి తల్లికి సీఎం నివాళి

(7వ పేజీ తరువాయి)

ఆర్ట్స్ అండ్ సైన్స్ గ్రౌండ్‌లో దిగారు. అక్కడినుంచి రోడ్డు మార్గాన ఫంక్షన్ హాల్‌కు చేరుకున్నారు. వేదికపై 4 నిమిషాలు గడిపారు. అనంతరం భోజనానికి వెళ్లారు. మధ్యాహ్నం 2.27 గంటలకు హైదరాబాద్‌కు తిరిగి వెళ్లారు. ముఖ్యమంత్రి వెంట ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, అడ్లూరి లక్ష్మన్, ఎంపీలు కడియం కావ్య, బలరాం నాయక్, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, మురళీనాయక్, రాంచంద్రునాయక్, యశస్వినిరెడ్డి, గండ్ర సత్యనారాయణరావు, ఎమ్మెల్సీలు బస్వరాజు సారయ్య, శ్రీపాల్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్ ఇనుగాల వెంకట్రాం రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎర్రబెల్లి వరద రాజేశ్వర్ రావు, బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో పాటు పలువురు ఇతర ప్రజాప్రతినిధులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, తదితరులు పాల్గొన్నారు. నర్సంపేట నియోజకవర్గం నుంచి దొంతి అనుచరులు, అభిమానులు, ప్రజలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.


అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో ఎంపీ కడియం కావ్య తదితరులు

భారీ బందో బస్తు

సీఎం రాక సందర్భంగా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఫక్షన్ హాల్‌లోనూ, బయట అడుగడుగునా పోలీసులు మోహరించారు. విస్తృతంగా తనఖీలు నిర్వహించారు. సీఎం రావడానికి అరగంట ముందే ఫంక్షన్ హాల్‌లోని వేదికను స్వాధీనం చేసుకున్నారు. సీఎం వచ్చి వెళ్లే వరకు ముఖ్యులను మాత్రమే వేదికపైకి అనుమతించారు. నాయకులు తరలివచ్చిన వాహనాలతో రోడ్డంతా నిండిపోయింది. సీఎంను చూసేందుకు చుట్టుపక్కల ప్రజలు భవనాలపై ఎక్కారు. డివైడర్లపై బారులు తీరి నిల్చున్నారు. సీఎం హాల్‌లోకి రాగానే కార్యకర్తలు ఈలలు వేస్తూ కేరింతలు కొట్టారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఘన స్వాగతం

హనుమకొండ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డికి హెలిప్యాడ్ వద్ద ఎమ్మెల్యేలు, అధికారులు, కాం గ్రెస్ నేతలు ఘన స్వాగతం పలికారు. హనుమకొండ కేయూ 100 ఫీట్ల రోడ్డులోని పీజీఆర్ గార్డెన్‌లో ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి మాతృమూర్తి దశదినం సందర్భంగా ఏర్పాటు చేసిన మాతృ వందనం కార్యక్రమంలో పాల్గొనేందుకు నగరానికి వచ్చిన సీఎంకు హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్‌లో ఘన స్వాగతం లభించింది. సీఎంతో పాటు మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మన్‌కుమార్, ముఖ్యమంత్రి సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి హైదరాబాద్ నుంచి హెలిక్యాప్టర్ ద్వారా ఆర్ట్స్ అండ్ కాలేజీ గ్రౌండ్ కు చేరుకున్నారు. హెలిప్యాడ్ వద్ద సీఎంకు మంత్రి సీతక్క, ఎంపీలు పోరిక బలరాంనాయక్, కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సార య్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, యశస్వినిరెడ్డి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణరావు, హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు స్నేహ శబరీష్, డాక్టర్ సత్యశారద, వరంగల్ పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్, టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, మేయర్ సుధారాణి, గ్రేటర్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, పలువురు కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు పుష్పగుచ్ఛాలు అందిం చి స్వాగతం పలికారు. శాలువాలతో సత్కరించారు. ఎమ్మెల్యే మాధవరెడ్డిని పరామర్శించిన అనంతరం హెలిప్యాడ్ వద్ద సీఎం కు మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు వీడ్కోలు పలికారు.




సీఎంకు బొకే ఇస్తున్న సీపీ సన్‌ప్రీత్‌సింగ్, పూలమొక్కలు ఇచ్చి స్వాగతం పలుకుతున్న కలెక్టర్లు స్నేహ శబరీష్, సత్య శారద

సీఎంను దగ్గర నుంచి చూడాలని ఆరాటం

- పక్కకు తోసేసిన పోలీసులు
- నెరవేరని పారిశుధ్య కార్మికుల కోరిక


పారిశుధ్య కార్మికులను అడ్డుకుంటున్న ఓ పోలీస్ అధికారి

హనుమకొండ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వారంతా మున్సిపల్ మహిళా పారిశుధ్య కార్మికులు. హనుమకొండలోని కేయూ 100 ఫీట్ల రోడ్డులోని పీజీఆర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాతృమూర్తి కాంతమ్మ మాతృవందనం కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి వస్తుండడంతో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ఉదయం నుంచే అక్కడ గ్యాంగ్ వర్క్ చేపట్టారు. మహిళా పారిశుధ్య కార్మికులు ఆ ప్రాంతమంతా ఊడ్చి శుభ్రం చేశారు. ఎక్కడా చెత్త కనిపించకుండా అద్దంలా మార్చారు. సీఎం రావడానికి కొద్దిసేపటి వరకు కార్మికులు పారిశుధ్య పనులు చేస్తూనే ఉన్నారు. ఇంతలో సీఎం వస్తుండంతో ఆయనను దగ్గర నుంచి చూడాలన్న ఉత్సుకతో ఈ మహిళా కార్మికులంతా చేతుల్లో చీపుర్లతోనే రోడ్డు పక్కన నిలబడి వేచి చూస్తున్నారు. సీఎం కాన్వాయి ఫంక్షన్ హాల్‌కు చేరుకుంటున్నది. వారిలో ఉత్సాహం మరింత పెరిగింది. ఉత్సాహంగా ముందుకు వస్తున్న వీరిని పోలీసు అడ్డుకున్నారు. దూరంగా పంపించారు. అంతలోనే సీఎం కారు ఫంక్షన్ హాల్‌లోకి రయ్‌మంటూ వెళ్లిపోయింది. దీనితో వారి కోరిక నెరవేరలేదు. నిరాశతో వెనుదిరిగారు.

ప్రజల గుండెల్లో నిలిచిన నేత ఉదయన్న

కాంగ్రెస్ అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : తన తుది శ్వాస విడిచేంత వరకు నిత్యం ప్రజల కోసం పని చేసి వారి గుండెల్లో చోటు సంపాదించుకున్న మహానాయకుడు చుక్కల ఉదయ్‌చందర్ అని కాంగ్రెస్ అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య, మాజీ జడ్పీటీసీ జిన్నారెడ్డి వెంకటేశ్వర్లు, ఎస్టీ సెల్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ గుగులోతు వెంకట్‌నాయక్ అన్నారు. మహబూబాబాద్‌లోని నర్సంపేట బైపాస్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో టీపీసీసీ అధికార ప్రతినిధి దివంగత చుక్కల ఉదయ్‌చందర్ ప్రథమ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో ప్రవేశించి ప్రజా సమస్యల పరిష్కారం కోసం పాటుపడ్డ నేత ఉదయ్‌చందర్ అని కొనియాడారు.

న్యాయవాదిగా పేదల పక్షాన నిలబడి ఎలాంటి ఫీజులు తీసుకోకుండా వారికి న్యాయం చేసే వారని చెప్పారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం అహర్నిశలు శ్రమించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎడ్ల రమేష్, లింగాల వీరభద్రం, బానోత్ ప్రసాద్, రామగోని రాజు, పోతురాజు రాజు, నిమ్మల శ్రీను, రాజేందర్, ఎమ్డీ.హరుణ్, గఫూర్, యాకూబ్, శంకర్, శ్రీధర్, గిరిధర్‌గుప్తా, వెంకటస్వామి, ఇంద్రారెడ్డి, విజయలక్ష్మి, సరోజదేవి పాల్గొన్నారు.



చుక్కల ఉదయ్‌చందర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు



మహబూబాబాద్‌లో మాట్లాడుతున్న రమేష్

గురుకులాలకు శాశ్వత భవనాలు నిర్మించాలి

● టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమేష్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని గురుకుల పాఠశాలలకు శాశ్వత భవనాలు నిర్మించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బలాష్టి రమేష్ అన్నారు. మహబూబాబాద్‌లో బుధవారం సంఘం మండల అధ్యక్షుడు గణపురం బిక్షపతి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రమేష్ మాట్లాడారు. గురుకుల పాఠశాలల్లో శాశ్వత భవనాలు లేకపోవడంతో పాటు గెస్ట్, కాంట్రాక్ట్ ఉపాధ్యాయులచే బోధన జరగడం వలన విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గురుకుల పాఠశాలల్లో సరియైన వైద్యవిధానాన్ని అమలు చేయాలని, పిల్లలకు పౌష్టిక ఆహారం అందించాలని, మానసిక ఒత్తిడిని తగ్గించి ఆత్మహత్యలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. గురుకుల పాఠశాలల్లో పర్యవేక్షణ లోపం ఉందని, పర్యవేక్షణాధికారులు కనీసం నెలకు ఒకసారైన పర్యవేక్షణ జరిపి సమస్యలు పరిష్కరించాలన్నారు. అనంతరం మహబూబాబాద్ మండలంలోని గిరిజన ఆశ్రమ, సాంఘిక సంక్షేమ, మహాత్మాజ్యోతిరావు పూలె గురుకుల పాఠశాలలను సందర్శించి కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న సీఆర్టీలకు టైం స్కేల్ వర్తింపచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రామలింగారెడ్డి, సోమ విష్ణువర్ధన్, నరిరాం, శ్రీనివాస్, దుర్గయ్య, ప్రభాకర్, మధుసూదన్, ఇలియాస్ పాల్గొన్నారు.

కలాం ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలి

● గూడూరు సీఐ జి.సూర్యప్రకాష్

గూడూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మాజీ రాష్ట్రపతి దివంగత అబ్దుల్ కలాం ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలని గూడూరు సీఐ జి.సూర్యప్రకాష్ అన్నారు. గూడూరు మండల కేంద్రంలో అబ్దుల్ కలాం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం అబ్దుల్ కలాం 94వ జయంతిని నిర్వహించారు. ఆస్పత్రిలో పండ్లను పంపిణీ చేసి, బస్టాండ్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సూర్యప్రకాష్ మాట్లాడుతూ అబ్దుల్ కలాం అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అధ్యక్ష, కార్యదర్శులు ముయ్యబోయిన వెంకన్న, ముక్తవరం సత్యనారాయణ, బానోత్ లక్ష్మణ్‌నాయక్, ఊకె లక్ష్మయ్య, వెంకటేశ్వర్లు, వీరన్న, ప్రభాకర్, బత్తుల శ్రీనివాస్, కన్న వెంకటేశ్వర్లు, స్వామి, వెంకట్‌రెడ్డి, ఐలబోయిన వీరయ్య, కొమురయ్య, పూర్ణచందర్, సారయ్య, మల్లయ్యసయ్యద్ కరీం, దేవేందర్‌రావు, బాబు, మొగిలి, వెంకన్న, అమ్ము పాల్గొన్నారు.

● బేతంచర్ల ప్రాథమిక పాఠశాలలో అబ్దుల్ కలాం చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాల వేసి, నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో ముయ్యబోయిన వెంకన్న, వేద సాంబయ్య, పూలమ్మ పాల్గొన్నారు.



మొక్కనాటుతున్న సీఐ సూర్యప్రకాష్, వాకర్స్

బంద్‌ను జయప్రదం చేయాలి

గూడూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 18న నిర్వహించబోయే తెలంగాణ బంద్‌ను జయప్రదం చేయాలని ఎంసీపీఐ(యూ) జిల్లా సహాయ కార్యదర్శి నూకల ఉపేందర్ పిలుపునిచ్చారు. బీసీ సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టబోయే బంద్‌కు ఎంసీపీఐ (యూ) పార్టీ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు చెప్పారు. ఈ బంద్‌లో బీసీ ప్రజలు, ప్రజాస్వామికవాదులు, మేధావులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా శ్రీనివాస్



మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : సీఐటీయూ అనుబంధ తెలంగాణ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా మానుకోటకు చెందిన కాంపెల్లి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. రంగారెడ్డి జిల్లా తుర్కయాజల్‌లో ఈనెల 14,15 తేదీల్లో జరిగిన సంఘం రాష్ట్ర మహాసభలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అందులో పట్టణానికి చెందిన శ్రీనివాస్‌కు రాష్ట్ర కమిటీ సభ్యుడిగా అవకాశం దక్కింది. శ్రీనివాస్ ప్రస్తుతం యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. తనపై నమ్మకంతో రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఎన్నుకున్న ప్రతీ ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కబడ్డీ పోటీలకు రిషిక ఎంపిక



మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలో ఈనెల 16, 17, 18 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థిని రిషిక ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు గిరిజ బుధవారం తెలిపారు. మహబూబాబాద్ మండలం కంబాలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని రిషిక ఈనెల 14న ములుగు జిల్లా జాకారంలో నిర్వహించిన ఎస్జీఎఫ్ అండర్-14 బాలికల విభాగంలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా రాణించి పాఠశాలకు, జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. రిషిత రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల ఉపాధ్యాయ బృందం సోహెన్‌బీ, శ్రీధర్ రెడ్డి, శ్రీనివాసరావు, తిరుపతి, శిబారాణి, సోమేశ్వర్, వెంకటేశ్వర్లు, మల్లారెడ్డి, కృష్ణమూర్తి, వీరభద్రం, యుగందర్ అభినందించారు.

షెడ్యూల్ ప్రకారం సిలబస్ పూర్తి చేయాలి

● అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : విద్యాశాఖ విడుదల చేసిన 2025-26 క్యాలెండర్ షెడ్యూల్ ప్రకారం సిలబస్ పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాల, ఈదులపూసపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను బుధవారం ఆకస్మికంగా సందర్శించి వంట గదులు, డైనింగ్ హాల్, స్టాక్ రూంలను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని, పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థులచే పాఠ్యాంశాలను చదివించి విద్యార్థులు సామర్థ్యాలు సాధించేలా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి, వెనుకబడిన విద్యార్థులకు వచ్చే సందేహాలను నివృత్తి చేస్తూ వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేలా సంసిద్ధులను చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఉపాధ్యాయులు చెప్పే పాఠ్యాంశాలను ఎప్పటికప్పుడు చదువుతూమంచి ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. ఆయా సందర్శనల్లో ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రమేష్, హెచ్ఎం, ఉపాధ్యాయులు ఉన్నారు.



ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాలలో స్టోర్‌రూంను పరిశీలిస్తున్న లెనిన్ వత్సల్‌టొప్పో

గీత వృత్తిలో ఆధునీకరణకు చర్యలు తీసుకోవాలి

● కేజీకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గౌని వెంకన్న



మండల మహాసభలో మాట్లాడుతున్న గౌని వెంకన్న

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : కల్లుగీత వృత్తిలో ఉపాధి అవకాశాల కోసం ఆధునీకరణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కల్లుగీత కార్మిక సంఘం (కేజీకేఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి గౌని వెంకన్న కోరారు. మానుకోట జిల్లా కేంద్రంలో సంఘం మహబూబాబాద్ మండల మహాసభను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన వెంకన్న మాట్లాడుతూ తరతరాల నుంచి కల్లుగీత వృత్తి చేస్తూ ప్రభుత్వానికి కోట్లాది రూపాయలు చెల్లిస్తున్న గీత కార్మికుల సంక్షేమాన్ని పాలకులు మరిచారని విమర్శించారు. కల్లుగీత కార్మికుల అభ్యున్నతికి పాలకులు కృషి చేయాలని కోరారు. కల్లుగీత వృత్తిదారులకు గీతన్నబంధు పేరుతో రూ.10 లక్షల చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం సంఘం మండల కమిటీని ఎన్నుకున్నారు. ఈకార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులుగా గుదె వెంకన్న, ఎలుకట్టి సైదులు, ఉపాధ్యక్షుడిగా గోల్కొండ మల్లయ్య, కమిటీ సభ్యులుగా కోల యాదగిరి, రామ్మూర్తి, శ్రీను, చామకూరి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు యమగాని వెంకన్న పాల్గొన్నారు.

హమాలీ వర్కర్స్ యూనియన్ మండల కమిటీ ఎన్నిక

నెల్లికుదురు, అక్టోబర్ 15 (ఆంధ్రజ్యోతి) : ఆల్ హమాలీ వర్కర్స్ యూనియన్ మండల కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సీఐటీయూ జిల్లా నాయకుడు పెరమాండ్ల బాబుగౌడ్ తెలిపారు. మండల అధ్యక్షుడిగా కారం రవి, ఉపాధ్యక్షులుగా కంపాటి ప్రసాద్, మద్ది కృష్ణమూర్తి, కార్యదర్శులుగా రత్నపురం వీరభద్రం, గుర్రాల శ్రీను, కోశాధికారిగా ఇసంపెల్లి ఐలేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

డీసీసీ అధ్యక్ష పదవికి గుట్టయ్య దరఖాస్తు

నెల్లికుదురు, అక్టోబర్ 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నైనాల గ్రామానికి చెందిన పెరమాండ్ల గుట్టయ్య డీసీసీ అధ్యక్ష పదవి కోసం దరఖాస్తును బుధవారం ఏఐసీసీ పరిశీలకుడు పట్నాయక్‌కు అందజేశారు. ఈ సందర్భంగా గుట్టయ్య మాట్లాడారు. 2010 నుంచి కాంగ్రెస్ పార్టీలో చురుకైన కార్యకర్తగా పనిచేసి 2019లో నైనాల ఎంపీటీసీగా గెలుపొందినట్లు తెలిపారు. కిసాన్ కాంగ్రెస్ పార్టీ కోఆర్డీనేటర్‌గా కొనసాగుతూ జనగామ, సూర్యాపేట జిల్లాల ఇన్‌చార్జిగా పనిచేసినట్లు తెలిపాడు. భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేశానని, డీసీసీ అధ్యక్షపదవి ఇవ్వాలని కోరుతున్నట్లు తెలిపారు.

'క్రీడలతో స్నేహభావం పెంపొందుతుంది'

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని, ఆటలతో స్నేహభావం పెంపొందిస్తాయని మండల విద్యాధికారి వెంకటేశ్వరరావు అన్నారు. మహబూబాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో బుధవారం ఎస్జీఎఫ్ఐ మండలస్థాయి అండర్-14 బాల, బాలికల కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని, చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడలు మానసిన ధైర్యం, దేహదారుఢ్యం పెంపొందిస్తాయని పేర్కొన్నారు. పాఠశాల స్థాయి నుంచే క్రీడలపై ఆసక్తిని పెంపొందించేలా శిక్షణ ఇవ్వాలని వ్యాయామ ఉపాధ్యాయులకు సూచించారు. ఈ పోటీలకు మండలంలోని అన్ని యాజమన్యాల పాఠశాలలకు చెందిన 600 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీలను వ్యాయామ ఉపాధ్యాయులు బానోత్ చాంప్లానాయక్, పుష్పలీల, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, నజీరుద్దీన్, శంకర్, రాజన్న, సుదర్శన్, రఘు ఇస్మాయిల్ నిర్వహించారు.

24, 25 తేదీల్లో జీపీ వర్కర్స్ యూనియన్ సభలు

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : గార్ల మండల కేంద్రంలో ఈనెల 24, 25 తేదీల్లో తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలను నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కుమ్మరికుంట్ల నాగన్న తెలిపారు. మహబూబాబాద్ పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో బుధవారం సంఘ సమావేశాన్ని సుధాకర్ అధ్యక్షతన నిర్వహించారు. గార్లలో జరిగే రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ధర్మారపు సుధాకర్, బోడ సురేష్, వెంకన్న, స్వామి, విజయ్, రవి, వీరన్న, అలీ, రమేష్, రఘు, రాజు, మోహన్, అచ్చమ్మ, లింగన్న పాల్గొన్నారు.

'కేసులు ఎత్తివేయకుంటే పోరాటాలు తప్పవు'

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : నల్లచట్టాలు రద్దు చేయాలని, ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం చేయాలని పోరాడిన వామపక్ష పార్టీల నేతలపై నాటి ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించిందని తక్షణమే వాటిని ఎత్తివేయకుంటే పోరాటాలు తప్పవని సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు బి.విజయసారధి, న్యూడెమోక్రసీ నేతలు మండల వెంకన్న, గౌని ఐలయ్య హెచ్చరించారు. నల్లచట్టాల రద్దు, ఆర్టీసీ విలీనోద్యమ కేసులో వామపక్ష పార్టీల నాయకులు బుధవారం మానుకోట జిల్లా కోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బి.అజయ్‌సారధిరెడ్డి, నల్లు సుధాకర్‌రెడ్డి, ఆకుల రాజు, రాజన్న, పెరుగు కుమార్, సీవన్, వెంకన్న, శేఖర్, ఉపేందర్, రాజమౌళి, మదార్, సాయిలు, దేవేందర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వామపక్ష నేత బి.విజయసారథి

ఆర్యూబీ వద్ద వాహనదారులకు నరకయాతన



డీఈ ఉపేందర్‌కు వినతి పత్రాన్ని అందిస్తున్న బీజేపీ నేతలు

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రైల్వే అండర్ బ్రిడ్జీ (ఆర్యూబీ) వద్ద వరద నీరుతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు క్యాచువల్ శ్యాంసుందర్‌శర్మ, జిల్లా కార్యదర్శి దారా ఇందుభారతి అన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం మహబూబాబాద్ ఆర్యూబీని సందర్శించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్యూబీ వద్ద పగిలిన పైపులైన్‌తో నిత్యం వరదనీటితో బురద మయం కావడం, గుంతలు పడడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. కొంతమంది కిందపడి గాయాలపాలైన సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. అనంతరం మునిసిపల్ కార్యాలయంలో డీఈ ఉపేందర్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రవి, వలపదాపు భద్రయ్య, రవియాదవ్, రేష్మ, జనసేన నేతలు చక్రి, శంకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లో మార్క్‌ఫెడ్‌ను ప్రారంభించాలి



సుధాకర్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘం నాయకులు

మహబూబాబాద్ అగ్రికల్చర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మొక్కజొన్న కొనుగోళ్లలో ధరలు తగ్గించి వ్యాపారులు ఖరీదు చేస్తున్నారని, క్వింటాకు రూ.1800 నుంచి రూ.2 వేల వరకే కొనుగోలు చేస్తున్నారని, మార్క్‌ఫెడ్ సంస్థను ప్రారంభించి క్వింటాకు రూ.3 వేల చొప్పున ఖరీదులు చేపట్టాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నల్లపు సుధాకర్ కోరారు. ఓ వినతి పత్రాన్ని బుధవారం వ్యవసాయమార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్‌కు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి కొనుగోళ్లకు సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, పత్తి క్వింటాకు రూ.10, 075 చొప్పున ఖరీదులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు నరేష్, ఎం.కృష్ణయ్య, బిక్షం, బాలు, సోమ్లు, సాయిలు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులకు నియామక పత్రాల అందజేత

● డీఎంహెచ్‌వో రవిరాథోడ్



నియామక పత్రాలు అందజేస్తున్న రవిరాథోడ్

మహబూబాబాద్ క్రైం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : వైద్య, ఆరోగ్య శాఖలో జాతీయ ఆరోగ్య మిషన్ పథకంలో భాగంగా కాంట్రాక్ట్ పద్ధతిలో ఎంపిక చేసిన ఉద్యోగులకు బుధవారం నియామక పత్రాలు అందజేసిన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎంఅండ్‌హెచ్‌వో భూక్య రవి రాథోడ్ మాట్లాడారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వైద్య, ఆరోగ్యశాఖలో జాతీయ మిషన్ పథకంలో భాగంగా ఎంఎల్‌హెచ్‌పి, స్టాఫ్‌నర్స్, ఎన్‌సీడి స్టాఫ్ నర్స్ పోస్టులను రోస్టర్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం అభ్యర్థులను ఎంపిక చేశామని, దీనిలో బాగంగా ముగ్గురు ఎంఎల్‌హెచ్‌పి, 8 మందికి ఎన్‌సీడీ స్టాఫ్‌నర్సులు, 2 ఎంహెచ్ఎస్ స్టాఫ్ నర్సులకు నియామక పత్రాలు అందజేసినట్లు ఆయన తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కేసముద్రం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం వివిధ పనుల కోసం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని కేసముద్రం ఏడీఈ మచ్చ ఐలయ్య తెలిపారు. ఆర్‌అండ్‌బీ రోడ్డు విస్తరణ కోసం చెట్లు తొలగించేందుకు, సబ్‌స్టేషన్‌లో నవీకరణ, మరమ్మతులు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఏబీ స్విచ్‌ల రిపేర్ తదితర పనుల కోసం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నాన్ బెయిలబుల్ వారెంట్‌పై ఒకరికి రిమాండ్

మహబూబాబాద్ క్రైం, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి) : నాన్ బెయిలబుల్ వారెంట్‌పై ఒకరిని అరెస్ట్ చేసి, కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ మహేందర్‌రెడ్డి బుధవారం తెలిపారు. టౌన్‌పోలీస్‌స్టేషన్‌లో నిందితున్ని అరెస్ట్ చూపి వివరాలు వెల్లడించారు. పట్టణంలోని సుందరయ్య నగర్ కాలనీకి చెందిన మాదాసి కార్తీక్ 2020లో భూ తగాద విషయంలో ఫిర్యాదు దారునిపై దాడి చేసి, గాయపరిచాడు. సదరు కేసులో న్యాయస్థానం జారీ చేసిన నాన్ బెయిలబుల్ (ఎన్‌బీడబ్ల్యూ) మేరకు నిందితున్ని అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు. ఎవరైనా కేసు సంబంధిత విషయాలల్లో కోర్టుకు హాజరు కాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేయడం జరుగుతుందన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి

(7వ పేజీ తరువాయి)

అందే విధంగా చూడాలన్నారు. అనంతరం గర్భిణీలకు శ్రీమంతాలు, చిన్నారులకు అక్షరభ్యాసం, అన్న ప్రసన్న వేడులకను నిర్వహించారు. ఈకార్యక్రమంలో డీడబ్ల్యూవో సబిత, సీడీపీవో శిరీష, అఖిల, కాంగ్రెస్ నేతలు మిట్టకంటి రాంరెడ్డిచ అజ్మీర సురేష్‌నాయక్, పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

కేసముద్రం : గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ అన్నారు. వెంకటగిరిలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.20లక్షలతో నిర్మించే నూతన గ్రామపంచాయతీ భవనం పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో రాజకీయాలకతీతంగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, ఎంపీడీవో జె.క్రాంతి, తహసీల్దార్ వివేక్, డీసీసీ ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, టీపీసీసీ మాజీ సభ్యుడు గుగులోత్ దస్రూనాయక్, సొసైటీ మాజీ చైర్మన్ బండారు వెంకన్న, గ్రామపార్టీ అధ్యక్షులు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ విద్యార్థుల దినోత్సవం

నర్సింహులపేట (మహబూబాబాద్ క్రైం) అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నర్సింహులపేట మండలం పడమటిగూడెం యూపీఎస్ పాఠశాలలో ప్రపంచ విద్యార్థుల దినోత్సవం బుధవారం నిర్వహించారు. ఎంఈవో రాంమోహన్‌రావు ముఖ్యఅతిథిగా పాల్గొని ఏపీజే అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు ఎర్ర పూర్ణచందర్ ఆర్థిక సహకారంతో పాఠశాల విద్యార్థులకు టై, బెల్ట్, ఐడీ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఈవో మాట్లాడారు. ఉపాధ్యాయులు శ్రీనివాస్, మురళి, శేఖర్, తిరుపతయ్య, వెంకన్న, సీఆర్‌పీ రవి పాల్గొన్నారు.

కల్వలలో కొత్త మార్కెట్?

(7వ పేజీ తరువాయి)

కార్యాలయ భవనం కోసం రూ.2.16 కోట్లు అంచనా వేశారు. రెండు గోదాంలు, ప్రహరీ, మరుగుదొడ్లు, వేబ్రిడ్జి, హమాలీ, దడువాయి, రైతు, గుమస్తాల విశ్రాంతి భవనాలు, మార్కెట్లో అంతర్గత రోడ్లు, ఆరబెట్టుకునే కల్లాలు, ఓపెన్ సీసీ యార్డు, 40వేల లీటర్ల సామర్థ్యంతో ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకు, ఆర్‌వో సిస్టం, క్యాంటీన్, బ్యాంకు భవనం, టెండరు హాలు, అసేయింగ్ ల్యాబ్, అగ్నిప్రమాద రక్షణ వ్యవస్థ, విద్యుదీకరణ తదితర సౌకర్యాలన్నిటికీ రూ.27.5 కోట్లతో అంచనాలు రూపొందించారు. అలాగే కేసముద్రం మార్కెట్లో మరో రెండు కవర్‌షెడ్ల కోసం రూ.3.84 కోట్లు, అంతర్గత సీసీ రోడ్లు, టాయ్‌లెట్లు, డ్రైనేజీ కోసం రూ.88లక్షలు వెరసి రూ.4.72 కోట్లుతో ప్రతిపాదనలు పంపించారు. ఈ నేపథ్యంలో కేసముద్రం మండల కేంద్రం నుంచి ఈ ప్రాంతం మీదుగా గ్రీన్‌ఫీల్డ్ హైవేను అనుసంధానం చేస్తూ మెరుగైన రవాణా కోసం నాలుగులైన్ల రహదారి అవసరమవుతున్న క్రమంలో ఆ దిశగా ప్రయత్నాలు కూడా చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రతిపాదనలు మంజూరైతే కేసముద్రం మండలంలో అభివృద్ధి పరంగా విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటూ మార్కెట్ చరిత్రలో కొత్త అధ్యాయం ప్రారంభం కాబోతోందనే వాస్తవం.